క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో బోయమాంబ విగ్రహ ప్రతిష్ట



అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్, పార్టీ నాయకులు

పరవాడ: మండలంలో పి.బోనంగి శివారు వి.ఎల్.ఎన్ పురంలో నూతనంగా నిర్మించిన బోయమాంబ ఆలయంలో శనివారం ఉదయం 10 గంటలకు అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పి.ఎస్.రాజు. మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, పి.బోనంగి సర్పంచ్ బండారు కల్పనరాజశేఖర్, నాయకులు చల్లా కనకారావు, బొద్దపు చిన్నారావు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎక్స్‌పో



విద్యార్థులతో ముచ్చటిస్తున్న జీవీఎంసీ అదనపు కమిషనర్ విశ్వనాథన్

పెందుర్తి: సుజాతనగర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో శనివారం నిర్వహించిన సైన్స్ ఎక్స్‌పో ఆకట్టుకుంది. ఎక్స్‌పోను జీవీఎంసీ అదనపు కమిషనర్ కె.ఎస్. విశ్వనాథన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. సాంకేతిక పరిజ్ఞానం ప్రతీ విద్యార్థికి అవసరమని చెప్పారు. విద్యార్థులు తమ సృజనాత్మకతతో రూపొందించిన వివిధ ప్రాజెక్ట్‌లు ఆకట్టుకున్నాయి. ఎన్ఎస్‌టీఎస్ శాస్త్రవేత్త సి.మంజులత, జీఎం కె.రమ్య, ప్రిన్సిపాల్ ఆర్.స్వరూప, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



దాతకు బాండ్ అందజేస్తున్న సూపరింటెండెంట్ కనకరాజు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి శనివారం సింహాచలంకి చెందిన లొడగల కేశవరావు అనే దాత రూ.లక్ష విరాళాన్ని సింహగిరిపై పీఆర్వో కార్యాలయంలో అందజేశారు. దేవస్థానం తరఫున స్వామివారి దర్శనం కల్పించారు. సూపరింటెండెంట్ కనకరాజు దాతకు బాండ్ అందజేశారు.

సందడిగా గ్రాడ్యుయేషన్ డే



పట్టాలు అందుకున్న చిన్నారులతో డైరెక్టర్ ఉదయనాగశ్రీ, ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి

పరవాడ: మండలంలోని పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాలలో కిండర్ గార్డెన్‌డేను శనివారం సందడిగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న పాఠశాల డైరెక్టర్ ఉదయనాగశ్రీ చిన్నారులకు పట్టాలు పంపిణీ చేశారు.

మార్చి 26 నుంచి సుదర్శన నారసింహ మహాయజ్ఞం

సింహాచలం : సింహగిరిపై మార్చి 26 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు చదుర్వేద హవనపూర్వక, పాంచాహ్నిక పంచకుండాత్మక శ్రీ సుదర్శన నారసింహ మహా యజ్ఞాన్ని నిర్వహించనున్నట్టు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి శనివారం తెలిపారు. దేశం శస్య శ్యామలంగా ఉండాలని, ప్రజలందరికీ శాంతి సౌభాగ్యాలు లభించాలని కాంక్షిస్తూ మహా యజ్ఞం నిర్వహించనున్నామన్నారు. మార్చి 26న అంకురార్పణతో ప్రారంభమయ్యే మహా యజ్ఞం ఏప్రిల్ 1న జరిగిన మహా పూర్ణాహుతితో ముగుస్తుందని తెలిపారు. దీనిలో భాగంగా ఆదివారం ఉదయం సింహగిరిపై ఉత్తర రాజగోపురం ఎదురుగా ఉన్న ఖాళీ ప్రదేశంలో భూమిపూజ నిర్వహిస్తామని తెలిపారు.

ఆధ్యాత్మికం

రామయ్యా.. కొలువు తీరాడయ్యా..

పెందుర్తి నియోజకవర్గంలో శనివారం ఆధ్యాత్మిక భావం ఉప్పొంగింది. మాఘ పౌర్ణమి పురస్కరించుకుని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతనంగా నిర్మించిన పలు ఆలయాలను ప్రారంభించారు. ఫలితంగా పెందుర్తి, సబ్బవరం, పరవాడ మండలాల్లోని ఆ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భారీగా అన్నసమారాధనలు నిర్వహించారు.



కోదండ సీతారాముల ఉత్సవ విగ్రహం



శ్రీ కోదండ సీతారాముల సన్నిధిలో నిర్వహిస్తున్న ప్రత్యేక పూజలు

సబ్బవరం: మండలంలోని ఆరిపాక శివారు పెద యాతపాలెంలో పునర్నిర్మించిన కోదండ సీతారామాలయ ప్రారంభోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. కలశప్రతిష్టాపన కార్యక్రమాన్ని వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వైస్ ఎంపీపీ శరగడం ఝాన్సీలక్ష్మీరాణి, రాము దంపతులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మధ్యాహ్నం స్వామివారి సన్నిధిలో నిర్వహించిన భారీ అన్నసమారాధనలో వేలాది మంది భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు. అన్నమాచార్య వాగ్గేయ వరదాయిని సభ్యులతో నిర్వహించిన భక్తి సంగీత కోలాటం ఆకట్టుకుంది. సాయంత్రం దీపోత్సవం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు, మాజీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి తదితరులు స్వామిని దర్శించుకున్నారు.

కల్యాణం.. కమనీయం



కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకులు గిరి, శ్రీకాంత్ తదితరులు కల్యాణం నిర్వహించారు.

ఘనంగా లలితా జయంతి



సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలో సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి ఆరాధన క్షేత్రంలో మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని లలితా జయంతిని శనివారం వేడుకగా నిర్వహించారు. వేకువజామున గోమాత పూజతో ప్రారంభమై ఖడ్గమాల దేవతలకు షోడశోపచార పూజలు,సామూహిక కళావాహన పూజలు చేశారు.వేదమంత్రాల నడుమ పంచామృతాభిషేకాలు,ఖడ్గమాల సహిత కుంకమార్చనలు జరిగాయి.గురుమాత అన్నపూర్ణమ్మ మధ్యాహ్నం భారీ అన్నసమారాధనను ప్రారంభించారు. కార్యక్రమంలో శ్రీవిద్యా ట్రస్టు సభ్యులు కందర్ప ప్రభాకర్,కందర్ప రమ పాల్గొన్నారు.

వైభవంగా త్రిపురాంతకస్వామి వసంతోత్సవం



త్రిపురాంతకస్వామి ఉత్సవమూర్తులు



స్వామికి తిరువీధి నిర్వహిస్తున్న సిబ్బంది

సింహాచలం: సింహగిరి క్షేత్రపాలకుడు త్రిపురాంతకస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న భీష్మ ఏకాదశి వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శనివారం వసంతోత్సవం, పూర్ణాహుతి కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఉదయం గణపతిపూజ, పుణ్యాహవచనం, మండపారాధన, హోమం, పూర్ణాహుతి చేపట్టారు. అనంతరం శివపార్వతుల ఉత్సవమూర్తులను పల్లకీలో అధిష్టింపజేసి తిరువీధిగా గంగధార వద్దకు తీసుకెళ్లారు. గంగధార వద్ద ఉత్సవమూర్తులను అభిషేకించి అనంతరం వసంతోత్సవం వైభవంగా నిర్వహించారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యురాలు సువ్వాడ శ్రీదేవి పాల్గొన్నారు. సూపరింటెండెంట్ పిల్లా శ్రీనివాసరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వెంకన్నకు తోమాల సేవ



తులాభారం నిర్వహిస్తున్న భక్తులు



పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకు జామున సుప్రభాత సేవ చేసి అనంతరం తోమాల సేవ జరిపారు. సహస్రనామార్చన, అష్టోత్తరం, దూపసేవ నిర్వహించారు. వెంకన్న సన్నిధిలో భక్తులు తులాభారం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తుల కోసం వెంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

వైఎస్సార్‌సీపీలోకి జనసేన నాయకులు



జనసేన నాయకుడు అప్పారావును వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ: మండలంలోని వాడచీపురుపల్లి జనసేన నాయకుడు మాసవరపు అప్పారావు తన అనుచర వర్గంతో కలిసి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే అదీప్‌రాజ్ క్యాంపు కార్యాలయంలో అప్పారావు తన అనుచర వర్గమైన 18 కుటుంబాల వారితో కలిసి రాగా ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి సాదరంగా వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, వైస్ ఎంపీపీలు బి.నాగేశ్వరరావు, బి.అప్పలరాజు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, లంకెలపాలెం పీఏసీఎస్ చైర్మన్ బురద రాజు, పార్టీ నాయకులు పెదిశెట్టి శేఖర్, గెద్దం చంద్రారావు, పైల అప్పలనాయుడు, కూండ్రపు తాతాజీ, కంచిపాటి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సెమీస్‌కు ముంబయి, చెన్నై

విశాఖ స్పోర్ట్స్: ఆల్ ఇండియా మేజర్ పోర్ట్స్ కబడ్డీ చాంపియన్‌షిప్‌లో ఏ పూల్‌లో ముంబయి పోర్టు, బీ పూల్‌లో చెన్నై పోర్టు జట్లు ఆధిక్యాన్ని ప్రదర్శించి సెమీస్‌కు చేరుకున్నాయి. సెమీస్‌లో ముంబయితో ట్యుటికోరిన్ పోర్టు జట్టు, చెన్నైతో జేఎన్‌పీ జట్టు తలపడనున్నాయి. పోర్టు స్టేడియంలో జరుగుతున్న పోటీల్లో శనివారం ఉదయం ట్యుటికోరిన్ జట్టు 61–39 పాయింట్లతో పారాదీప్ పోర్టు జట్టుపై విజయం సాధించింది. తొలి అర్ధభాగంలో కేవలం (28–21) ఏడు పాయింట్లే ఆధిక్యం సాధించిన ట్యుటికోరిన్ జట్టు.. తర్వాత పుంజుకుని విజయం సాధించింది. భరత్ 26, వేలన్ 14 పాయింట్లు సాధించారు. మరో మ్యాచ్‌లో జేఎన్‌పీ జట్టు 31–19తో ఎన్ఎంపీ జట్టుపై విజయం సాధించింది. తొలి అర్ధభాగంలో రెట్టింపు(18–9)పాయింట్లతో జేఎన్‌పీ ఆధిక్యంలోకి దూసుకెళ్లగా.. పార్థీ 15, ప్రమోద్ 10 పాయింట్లతో విజయాన్ని ఖరారు చేశారు. ముంబయి పోర్టు జట్టు 36–16తో న్యూమంగళూర్ పోర్టు జట్టుపై విజయం సాధించింది. తొలి అర్ధభాగంలో 18–7లో ఆధిక్యంలోకి దూసుకెళ్లిన ముంబయి తరఫున సౌరభ్‌రౌత్ 15, సౌరభ్ పార్తే 10 పాయింట్లు సాధించారు. చెన్నై పోర్టు జట్టు 64–32తో పారాదీప్ పోర్టుపై విజయం సాధించింది.

నేడు మాదిగల ఆత్మీయ సమావేశం

సబ్బవరం: అనకాపల్లి రోటరీ క్లబ్‌లో ఆదివారం జరగనున్న మాదిగల ఆత్మీయ సమావేశాన్ని జయప్రదం చేయాలని సబ్బవరం మండల మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ అధ్యక్షుడు దువ్వ మనోహర్ మాదిగ కోరారు. మండలంలోని చినయాతపాలెం, వంగలి గ్రామాల్లో బొర్రా జయరాజు ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించారు. ఆదివారం జరగబోయే కార్యక్రమానికి మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గొటివాడ సామ్రాట్ కుమార్, ఇండుగుబిల్లి గోపి, మారేడుబూడి కోటి,గొటివాడ ఈశ్వరరావు పాల్గొన్నారు.

13 మద్యం సీసాలు స్వాధీనం

పరవాడ: వాడచీపురుపల్లి, బొద్దపువానిపాలెం గ్రామాల్లో ఇద్దరిని నుంచి 13 మద్యం సీసాలను పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. బొండా శ్రీనివాసరావు, సీహెచ్ చిన్నారావు అనే వ్యక్తులపై కేసులు నమోదు చేశామని సీఐ ఎస్.బాలసూర్యారావు చెప్పారు.

పెందుర్తి జేసీఎస్ కన్వీనర్‌గా సూర్యప్రకాష్



బొడ్డు సూర్యప్రకాష్

పెందుర్తి: మండల జేసీఎస్ ఇన్‌చార్జిగా వాలిమెరక జుత్తాడ గ్రామానికి చెందిన బొడ్డు సూర్యప్రకాష్ నియమితులయ్యారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది.

భక్తిశ్రద్ధలతో వెంకన్న తిరువీధి



వెంకన్నకు తిరువీధి నిర్వహిస్తున్న దృశ్యం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన కొండదిగువ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం స్వామికి గ్రామ తిరువీధి విశేషంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు వెంకన్న, శ్రీదేవి,భూదేవిలను విశేషంగా అలంకరించి శేషతల్పంపై అధిష్టింపజేసి సాయంత్రం అడవివరం గ్రామంలో తిరువీధి నిర్వహించారు. తమ ఇళ్ల ముందుకు వచ్చిన స్వామికి గ్రామస్తులు హారతులు అందజేశారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ



ప్రశంసాపత్రం అందుకుంటున్న పెందుర్తి పాలిటెక్నిక్ విద్యార్థులు, అధ్యాపకులు

పెందుర్తి: నగరంలోని గాయత్రీ విద్యా పరిషత్ కళాశాలలో శనివారం జరిగిన హార్డ్‌వేర్ ఎక్స్‌పో లో పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఈఈఈ ద్వితీయ సంవత్సర విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఎనేబుల్డ్ టెంపరేచర్ కండీషనింగ్ అనే ప్రాజెక్ట్ మీద జి.గణేష్, కె.తరుణ్, పి.కృపరాజు, ఆర్.గణేష్, టి.సాయి బృందం చేపట్టిన నమూనా ప్రథమ స్థానంలో నిలిచింది. 12 ఇంజినీరింగ్ కళాశాలలతో కలిసి పోటీ పడ్డ ఈ పాలిటెక్నిక్ కళాశాల బృందం ప్రతిభ కనబరచడం విశేషం. ప్రశంసా పత్రాలతో పాటు రూ.5 వేల నగదు బహుమతి అందుకున్నారు. విజేతలతో పాటు ప్రాజెక్ట్ గైడ్‌లు కె.వి. వెంకటేశ్వరరావు, వి.పవన్‌కుమార్‌లను ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ అభినందించారు.

చేనేత వస్త్రాలకు చిరునామా ఆంధ్రప్రదేశ్



శిల్పారామంలో చేనేత వస్త్ర మేళాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

పీఎం పాలెం: చేనేత ఉత్పత్తులకు చిరునామా ఆంధ్రప్రదేశ్ అని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పేర్కొన్నారు. భారత ప్రభుత్వ అభివృద్ధి కమిషనర్, చేనేత, న్యూఢిల్లీ సౌజన్యంతో ఆంధ్ర ప్రదేశ్ శిల్పారామం సొసైటీ ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాల ప్రదర్శన విక్రయ స్టాల్స్‌ను ఆయన స్థానిక శిల్పారామంలో శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక యుగంలో వస్త్రాల తయారీలో ఎన్ని విప్లవాత్మక మార్పులు వచ్చినప్పటికీ మన చేనేత కళాకారులు తయారు చేసిన వస్త్ర ఉత్పత్తులకు పోటీకాదన్నారు. రానున్న వేసవిలో ధరించడానికి చేనేత వస్త్రాలు ఎంతో సౌకర్యంగా ఉంటాయన్నారు. మార్చి 8వ తేదీ వరకూ కొనసాగనున్న చేనేత మేళాలో వస్త్రాలు కొనుగోలు చేసి చేనేత కళాకారులను ప్రోత్సహించాలని ఆయన కోరారు. స్థానిక పరిపాలన అధికారి విశ్వనాథరెడ్డి , రాష్ట్ర నగరాల కార్పొరేషన్ అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, 6వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు బొట్ట అప్పలరాజు, కె.వరలక్ష్మి, గాయత్రీ నగర్ అప్పారావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మాఘ పౌర్ణమి తీర్థం



తీరంలో పుణ్య స్నానాలు ఆచరిస్తున్న భక్తులు



తీరంలో ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఏర్పాటు చేసిన ఈశ్వరీయ ఆధ్యాత్మిక శిబిరం

పరవాడ: ముత్యాలమ్మపాలెం తీరంలో మాఘపౌర్ణమి తీర్థ మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. శుక్రవారం రాత్రి జాగరణ చేసిన భక్తులు శనివారం వేకువ జామున తీరంలో పుణ్య స్నానాలు ఆచరించి సూర్య నమస్కారం చేశారు. సమీపంలో కొలువుదీరిన మాధవస్వామిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ పర్యవేక్షణలో సీఐ ఎస్.బాలసూర్యారావు తీరంలో పటిష్ట పోలీసు బందోబస్తు నిర్వహించి భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకున్నారు. స్నాన ఘట్టాల వద్ద ఎటువంటి ప్రమాదాలు జరగకుండా 20 మంది గజ ఈతగాళ్లను ఆరు బృందాలుగా విభజించి భక్తులకు రక్షణ కల్పించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. తీరంలో ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విద్యాలయం ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక శిబిరం ఏర్పాటు చేసి శివుని బోధనలను భక్తులకు వివరించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన శివుని విగ్రహం వద్ద భక్తులు పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదం అందజేశారు. వాడచీపురుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది వైద్య సేవలు అందించారు.

ఓ వ్యక్తిని కాపాడిన ఈతగాళ్లు

తానాం గ్రామానికి చెందిన పైల సింహాద్రినాయుడు శనివారం మధ్యాహ్నం తీరంలో పుణ్య స్నానం ఆచరించడానికి వచ్చాడు. స్నానానికి తీరంలో దిగిన సింహాద్రినాయుడు ఈత కొడుతూ లోపలికి వెళ్లాడు. ఇంతలో వచ్చిన అలలు అతడిని లోపలికి ఈడ్చుకుపోవడాన్ని గమనించిన ముత్యాలమ్మపాలేనికి చెందిన గజఈతగాళ్లు సూరాడ తాతారావు, చేపల పొట్టప్పన్న ప్రమాదంలో కొట్టుమిట్టాడుతున్న సింహాద్రినాయుడును ఒడ్డుకి చేర్చి నుంచి రక్షించారు. తనను రక్షించిన మత్స్యకార యువకులకు సింహాద్రి నాయుడు కృతజ్ఞతలు తెలిపాడు.



స్నానపు ఘట్టాల వద్ద భద్రత చర్యలను పరిశీలిస్తున్న సీఐ బాలసూర్యారావు



ప్రమాదంలో చిక్కుకున్న వ్యక్తితో ఈతగాళ్లు



ప్రసాదం అందజేస్తున్న నాయకులు

27 నుంచి 9 కేంద్రాల్లో టెట్

విశాఖ విద్య: టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్–2024) ఈ నెల 27 నుంచి మార్చి 6 వరకు జరగనున్నట్లు డీఈవో ఎల్.చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 37,556 మంది అభ్యర్థులు హాజరవుతున్నట్లు వెల్లడించారు. వీరి కోసం జిల్లాలో 9 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తప్పనిసరిగా రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డు ఒరిజినల్, జెరాక్స్ ప్రతి, ఏదైనా గుర్తింపు కార్డు వెంట తీసుకొని రావాలన్నారు. మొదటి సెషన్ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందన్నారు. పరీక్ష సమయానికి అరగంట ముందు అభ్యర్థులు కేంద్రాలకు రావాలన్నారు. డీఈవో కార్యాలయంలో టెట్ సెల్ ఏర్పాటు చేశామన్నారు. ఇతర సమాచారం కోసం 9849245230, 6305538679 నంబర్లలో సంప్రదించాలన్నారు.

27న వైద్య ఉద్యోగుల గ్రీవెన్స్

మహారాణిపేట: ఉత్తరాంధ్ర జిల్లాల్లోని వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల కోసం ఈ నెల 27న గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు ఆర్జేడీ డాక్టర్ బి.సుజాత తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరు సీతారామరాజు జిల్లా, అనకాపల్లి, విశాఖ జిల్లాల్లోని వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది కి సమస్యలపై వినతులు ఇవ్వవచ్చు.

ఏయూతో పనిచేయడానికి జపాన్ సంస్థ ఆసక్తి

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయంతో పనిచేయడానికి జపాన్‌కు చెందిన ఏమని ఎంజైమ్ ఇంక్ ఇన్నోవేషన్ సెంటర్ గిఫు జపాన్ ఆసక్తి వ్యక్తం చేసింది. జపాన్ సంస్థ సీనియర్ శాస్త్రవేత్త ఏయూ పూర్వ విద్యార్థి డాక్టర్ జి.కిరణ్ కుమార్ శనివారం ఏయూను సందర్శించారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డితో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఏయూలో ఫుడ్ టెక్నాలజీ, బయోటెక్నాలజీ, హెల్త్ కేర్ రంగాలలో జరుగుతున్న పరిశోధనలను వివరించారు. ఏయూతో విభిన్న అంశాలలో కలసి పనిచేయాలని, పరిశోధన రంగంలో విదేశాలతో పనిచేయడానికి ఏయూ సిద్ధంగా ఉందని వీసీ ప్రసాద రెడ్డి స్పష్టం చేశారు. అదే విధంగా ఏయూ పూర్వ విద్యార్థులు విదేశాలలో ఉన్నత స్థానాలలో స్థిరపడటంపై హర్షం వ్యక్తం చేశారు. డాక్టర్ కిరణ్ కుమార్‌ను జపాన్ సంస్థ భారత్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యంలో భాగంగా పరిశోధన రంగంలో విద్యసంస్థలతో సంయుక్తంగా పనిచేసే దిశగా భారత్‌కు పంపింది. నీతి ఆయోగ్ విశాఖకు ఎకనామిక్ గ్రోత్ ఇంజన్‌గా గుర్తించింది. ఈ నేపథ్యంలో విశాఖలోని వివిధ రంగాలను పరిశీలించడానికి కిరణ్ కుమార్ ఏయూకు విచ్చేశారు. అనంతరం ఏయూలోని జపాన్ అధ్యయన కేంద్రాన్ని కిరణ్ కుమార్ సందర్శించారు. ఏయూ ఐపీఆర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ హనుమంతు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.